PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 247 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 01 సెప్టెంబర్ 2026


## ఆధ్యాత్మిక సేవలకు అంతర్జాతీయ గౌరవం




## అక్రమ పట్టాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి





# అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

- పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ..?
- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- అంబర్‌పేట సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి









**హైదరాబాద్,ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మిగతా2లో...



# కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కేక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ మిగతా2లో...

## కృష్ణా జలాలు తోచుకుపోతుంటే చోద్యం

- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు




## కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి

వేయి రోజుల్లో కెసిఆర్‌కు

కోటి 24 లక్షల 40 వేల జీతభత్యాలు

ఆందోళనలకు పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి





# ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు
- ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు



**హైదరాబాద్,ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో వచ్చే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రజా ప్రభుత్వం నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ -2026 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు, ఐటీ?పరిశ్రమల శాఖ మిగతా2లో...



## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం
- యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి

**లక్నో,ఆగస్టు 31(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఘోర మిగతా2లో...

# ధరణి కన్నా దరిద్రంగా భూభారతి

● 22ఎతో ప్రజలను కాల్చుకు తింటున్నారు ● ఇబ్బంది పడుతున్న దాదాపు 50 లక్షల మంది ● సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి ధర్నా



**సిద్ధిపేట,ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూమి వివరాల కోసం బీఆర్‌ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి ఇంకా దరిద్రంగా ఉందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. 22 ఏ తో దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మిగతా2లో...




## తండ్రి, బిడ్డను విడదీసిన ప్రశాంత్‌రెడ్డి

- శకుని పాత్ర పోషించిన వేముల ప్రశాంతరెడ్డి
- జీవితంలోల ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
- నిప్పులా తిరిగి వచ్చానని భావోద్వేగానికి గురి
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు

# భూభారతితో దశాబ్దాల భూసమస్యలకు చెక్

● సర్వే చేసి రైతులకు భూ ఆధార్‌తో పాస్‌బుక్కులు

● విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: మంత్రి పొంగులేటి



# అప్పును నెత్తిన పెట్టిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సిఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు.

16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు.కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు.ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధ రించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.

# ధరణి కన్నా దరిద్రంగా భూభారతి

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధిపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ మహాధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్థం లేని విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఒప్పుకున్నారని గుర్తు చేశారు. తప్పును మాత్రం సరిదిద్దుకోవడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు బీఆర్ ఎస్ అయినా.. నేడు కాంగ్రెస్ అయినా టైటిల్ మారింది తప్ప, దోపిడి విధానాలు మారలేదని వ్యంగ్యంగా అన్నారు. 03 సర్వే నెంబర్‌లో కేవలం రెండు ప్లాట్లు సమస్యల్లో ఉంటే వేలాది ఎ÷-లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని వివరించారు. అదే సర్వే నెంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు మాత్రం 22 ఏ నుంచి బయటకు ఎలా వచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. పేదల భూములు గుంజుకుని ప్రభుత్వం అమ్ముకుంటున్నదని విమర్శించారు. మ భూములు కాపాడండంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. 22 ఏ నిషేధిత జాబితాపై శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 ఏపై స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. రైతుల కోసం బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. వారి కోసం జైలుకైనా వెళ్తామని పేర్కొన్నారు.

అసెంబ్లీ ప్రారంభమయ్యే లోపు ప్రభుత్వం 22ఏ రద్దుపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బీజేపీ చీఫ్ రామచందర్ రావు సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులకు, పేదలకు న్యాయం అన్నారని ఆ పార్టీ నేతలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. కానీ ఇప్పుడు పేదలు, రైతుల పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పయింది సరి చేస్తామన్నారని చెప్పారని.. కానీ పేదలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ÷ఔములు విక్రయిస్తేనే రాష్ట్రాభివృద్ధి అంటున్నారని రేవంత్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. భూమి విక్రయాలను గొప్పగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. 22 ఏ రైతుల భూమి మీద పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు కష్టం వస్తే తహశీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. భూభారతి తెస్తే రైతు కష్టం తీరుతుందని చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు, రెవెన్యూ మంత్రి భూములు కూడా 22 ఏలో పడ్డాయని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దరఖాస్తులు ఇప్పుడు ప్రజలకు చూపాలని డిమాండ్ చేశారు. గుంపు మేస్త్రి దరఖాస్తు బహిర్గతం చేయాలని సవాల్ విసిరారు. మీ భూములు ఏ దరఖాస్తులు లేకుండా 22 ఏలో నుంచి ఎలా తీసేస్తారని ఈ సందర్భంగా వారిని సూటిగా ప్రశ్నించారు. మరి రైతుల భూములు ఎందుకు తియడం లేదని వారిని సందేహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లాలో భూములు ఎవరికి తెలియకుండా మాయం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరిట భూములు లాక్కున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

ఇక్కడి భూములు విక్రయించి.. ఆ సూట్ కేసులు ఢిల్లీకి మోస్తున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకో ఏడాది అయితే కాంగ్రెస్‌లో కార్యకర్తలు ఎవ్వరు ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల భూములు నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్‌ను నిషేధించాలని డిమాండ్ చేశారు.

సెప్టెంబర్ 7వ తేదీ లోగా 22 ఏ జీవో తొలగించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు.

## ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని ఈ వార్‌రూమ్ ద్వారా మరింత బలోపేతం చేయాలని అన్నారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్ల కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కమిటీకి సీనియర్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. అడ్వైజరీ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, హాస్పిటాలిటీ కమిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్ కమిటీ, మీడియా?కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్ కమిటీ, ఎంఓయూ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేసి, సీనియర్ ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి , వారితో సమావేశాలు నిర్వహించి సమ్మిట్ కార్యాచరణపై చర్చించాలని తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమర్థవంతంగా వివరించేలా కార్యక్రమ రూపకల్పన ఉండాలని సూచించారు. సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో దేశ రాజధాని ఢిల్లీలో రైజర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?2026పై ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేసి సమ్మిట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ రోజువారీ పురోగతి నివేదికను రూపొం దించి తనకు అందజేయాలని ఎలానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రతి కమి టీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు తీరు, పెండింగ్ అంశాలు, తీసు కోవాల్సిన తదుపరి చర్యలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ప్రపంచానికి పరి చయం చేసేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను నిర్వహించాలని, ఇందుకోసం ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

## కృష్ణా జలాలు తోచుకుపోతుంటే చోద్యం

**హైదరాబాద్,ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కృష్ణా జలాలలను ఎపి తరలించుకు పోతున్నా ఇంకెప్పుడు మేల్కొంటారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండి పడ్డారు. నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నె÷-టటెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం‘ అని హరీశ్ రావు అన్నారు.

## తండ్రి, బిడ్డను విడదీసిన ప్రశాంత్‌రెడ్డి

**నిజామాబాద్, ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):**‘బంగారు తెలంగాణ కాదు.. బహుజన తెలంగాణే తమ లక్ష్యం’ అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న సంకల్పంతో పార్టీని ఏర్పాటుచేశానని తెలిపారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో ఐదుకు ఐదు సీట్లు గెలుస్తామని ప్రకటించారు. పార్టీ ఏర్పాటు అనంతరం తొలిసారి నిజామాబాద్ వచ్చిన కవితకు ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ‘పాంచజన్య సంకల్ప సభ’లో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. కాంగ్రెస్‌ను ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ కూడా మౌనం వహిస్తోందని విమర్శించారు**వేముల ప్రశాంత్‌రెడ్డిని క్షమించను...** బీఆర్ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిపై కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనను, తన తండ్రి కేసీఆర్‌ను రాజకీయం గా దెబ్బతీయడంలో ఆయనదే ప్రధాన పాత్ర అని ఆరోపించారు.

## కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 11 మంది మృతిచెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటన పిప్రి పోలీస్ స్టేషన్ పరిధి మనోరి గ్రామంలో చోటుచేసుకుంది. మృతులను ప్రియాంజలి (5), ప్రవీణ్ సింగ్ (13), జహన్వి (12), ఆదిత్య (12), ఆదిత్య (8), రవి (8), అంజు (32), జ్ఞాన్ సింగ్ (40), విక్రమ్ సరోజ్ (35), అన్ష్ (6), నానా (4)గా పోలీసులు గుర్తించారు. మృతులంతా ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివసిస్తున్న వారేనని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వేళ బాణసంచా కర్మాగారంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు స్థానికంగా బీభత్సం సృష్టించి ంది. భారీ శబ్దంతో పేలుడు జరగడంతో ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఇళ్లని పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్రంగా గాయపడిన 16 మందిని ప్రయాగ్‌రాజ్‌లోని ఎస్‌ఆర్ఎన్ ఆస్పత్రికి తరలించగా.. 11 మంది చికిత్సపొందుతూ మరణించారని జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ తెలిపారు. మరో ఐదుగురికి చికిత్స అందుతోందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 18 మందికి పైగా గాయపడి నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తూ వాటి కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'కౌశాంబి జిల్లాలో ప్రమాదం తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేశాం' అని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి

**హైదరాబాద్,ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నా రు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బులెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంబర్‌పేట సభలో సిఎం మాట్లాడుతూ కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా? ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.’ అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు.

ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో మళ్లీ కులగణన చేసేందుకు ఈ దేశంలో ఏ నాయకుడు ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరిందన్నారు.


## భూభారతితో దశాబ్దాల భూసమస్యలకు చెక్

**మహబూబాబాద్,ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్)::** రాష్ట్రంలో రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న దశాబ్దాల భూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూ భారతి రీ-సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపు తున్నామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణ పురంలో దాదాపు 60 ఏళ్లుగా పరిష్కారం కాని అసైన్డ్ భూముల సమస్యను భూ భారతి రీ-సర్వే ద్వారా పరిష్కరించి, 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు సంబంధించిన భూ ఆ ధార్‌తో కూడిన పట్టా దార్ పాస్ బుక్కులను మంత్రి గారు పంపిణీ చేశారు. సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. తెలంగాణలో 125 ఏళ్ల క్రితం భూ సర్వే జరిగిందని, ఆ తర్వాత ఇంతవరకు సమగ్ర సర్వే జరగలేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నూ, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లు పాలించిన గత ప్రభుత్వం కూడా భూముల సమగ్ర సర్వేపై కనీసం ఆలోచన చేయలేదని విమర్శించారు. ÷ఎఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి స్థానంలో భూ యజమానులకు అండగా నిలిచేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రాన్ని భూ వివాదాలు లేని తెలంగాణగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. ÷-రతి అంగుళం భూమిని సర్వే చేసి, క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో కూడిన పట్టాదార్ పాస్ బుక్కులను రైతులు, భూ యజమానులకు అందిస్తున్నామని చెప్పారు. నాలుగు రోజుల క్రితం తుంగతుర్తిలో 13 గ్రామాలకు చెందిన రైతులకు 3,400 ఎకరాలకు పట్టాలు అందించామని, ఇప్పుడు నారాయణపురంలో 780 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇవన్నీ భూభారతి ద్వారానే సాధ్యమవుతున్నాయని అన్నారు. నారాయణపురంలో ఇంకా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న సుమారు 150 ఎకరాల అసైన్డ్ భూమికి సంబంధించిన సమస్యను కూడా త్వరలో పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ÷ూష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి అర్హుడికి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇందిరమ్మ ఇళ్లు ఉన్న గ్రామాలు, వార్డుల్లోనే ఓట్లు అడుగుతామని అన్నారు. ఇందిరమ్మ పరిపాలనలో రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశామని గుర్తుచేస్తూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అందుబాటులో లేని గత రెవెన్యూ మంత్రులు ఇప్పుడు భూ సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి దశాబ్దాలుగా ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని బీఆర్ఎస్‌కు ఇప్పుడు ప్రజాప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మంత్రి స్పష్టం చేశారు. మంచి పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకాడబోమన్నారు. 22ఏ నిషేధిత జాబితా, భూ సమస్యలు తదితర అంశాల్లో నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి నెల కనీసం ఒకటి, రెండు సార్లు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజాప్రతినిధుల సమీక్షా సమావేశాలకు డిప్యూటేషన్ పేరుతో సంతకాలు చేసి కొందరు తహసీల్దార్లు/ఎంఆర్వోలు హాజరు కాకపోవడంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అక్రమ పట్టాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

### తమ భూమిని ఇతరుల పేర్లపై పట్టా చేశారని ఆరోపణ

### ప్రజావాణిలో అధికారులకు బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు




**జేడీ మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండలం రామచంద్రాపురం శివారులోని సర్వే నంబర్ 3293లో తమ కుటుంబానికి చెందిన భూమిని తమకు ఎలాంటి సమాచారం లేకుండా ఇతరుల పేర్లపై అక్రమంగా పట్టా చేశారని ఆరోపిస్తూ భూమ స్వామి కుటుంబ సభ్యులు అధికారులను ఆశ్రయించారు. అక్రమంగా జరిగిన పట్టా మార్పిడులపై సమగ్ర విచారణ చేపట్టి, రికార్డులను పరిశీలించి, అక్రమ పట్టాలను రద్దు చేసి తమ భూమిని తమ కుటుంబ సభ్యుల పేర్లపై పట్టా చేయాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. మల్లంపల్లి మండలం బొల్లోనపల్లి గ్రామానికి చెందిన భూమ స్వామి తండ్రి భూమ లక్ష్మయ్య పేరున రామచంద్రాపురం శివారులోని సర్వే నంబర్ 3293, ఖాతా నంబర్ 1517లో రెండు ఎకరాల భూమి ఉన్నట్లు బాధితులు తెలిపారు. సదరు భూమిని తమ కుటుంబ సభ్యులు కొంతకాలంగా సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, తమ అనుమతి లేకుండానే సదరు భూమిలోని 1 ఎకరం 32 గుంటల భూమిని ఇతరుల పేర్లపై పట్టా మార్పిడి చేసినట్లు ఆరోపించారు. ముఖ్యంగా రామచంద్రాపురం గ్రామానికి చెందిన మార్త సదానందం, తండ్రి రాజయ్య తమ కుటుంబ భూమిలోని 0.36 గుంటల భూమిని క్యాతం ప్రవళిక, భర్త రమేష్ పేరుపై పట్టా చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో 0.36 గుంటల భూమిని ఓ మైనింగ్ సంస్థ పేరుపై పట్టా చేసినట్లు ఆరోపించారు. అంతేకాకుండా సదరు భూమిలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ భూమికి సంబంధించిన రికార్డుల్లో జరిగిన మార్పులు, పట్టా బదలాయింపులపై అధికారికంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. **బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణ** భూమి విషయంలో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించేందుకు గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని బాధితులు తెలిపారు. పైగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీంతో తమకు భద్రత కల్పించడంతో పాటు భూమి రికార్డులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను కోరారు. తమ కుటుంబానికి చెందిన భూమిని తమకు తెలియకుండా ఇతరుల పేర్లపై పట్టా చేయడంపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించాలని, సంబంధిత రెవెన్యూ రికార్డులు, పట్టా మార్పిడి వివరాలు, భూమి హక్కులకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. విచారణ అనంతరం అక్రమంగా పట్టా మార్పిడి జరిగినట్లు తేలితే వాటిని రద్దు చేసి, అసలు భూ యజమానుల హక్కులను పునరుద్ధరించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో భూమ స్వామి, స్వరూప, జనార్దన్, చంద్రమౌళి, కవిత, ప్రవీణ్, పూల, సతీష్, మేఘ అర్జున్, సందీప్ తదితరులు ఉన్నారు.

---


# ఆధ్యాత్మిక సేవలకు అంతర్జాతీయ గౌరవం

### డల్లాస్ థియోలాజికల్ యూనివర్సిటీ ద్వారా ఆదూరి ఉదయ భాస్కర్ కు గౌరవ డాక్టరేట్

### 37 ఆధ్యాత్మిక గ్రంథాలతో మానవాళికి సందేశం వేలాది మందికి యోగ, ధ్యాన విద్యాబోధన




**హైదరాబాద్ ఆగస్టు 31(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆధ్యాత్మిక రంగంలో విశేష సేవలు అందిస్తున్న ఆదూరి ఉదయ భాస్కర్ కి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. అమెరికాలోని డల్లాస్‌కు చెందిన థియోలాజికల్ యూనివర్సిటీ ద్వారా ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆధ్యాత్మిక, యోగ, ధ్యాన రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక జీవన ప్రయాణంలో భాగంగా హిమాలయ మాస్టర్స్ గురు పరంపర ఆదేశాలు, సందేశాలను లోకకళ్యాణార్థం ప్రజలకు చేరవేసే లక్ష్యంతో ఆదూరి ఉదయ భాస్కర్ ఇప్పటివరకు 37 ఆధ్యాత్మిక గ్రంథాలను రచించి మానవాళికి అందించారు. ఆధ్యాత్మిక సాధన, ధ్యానం, యోగ, మంత్ర సాధన వంటి అంశాలపై ఆయన చేస్తున్న కృషికి విశేష స్పందన లభిస్తోంది. **మహాలక్ష్మి సాధనలు సంపూర్ణ యజ్ఞ కార్యక్రమాలు** అష్టైశ్వర్యాలను ప్రసాదించే మహాలక్ష్మి సాధనలు, అమావాస్య సాధనలు, సామూహిక సంపూర్ణ యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఆదూరి ఉదయ భాస్కర్ స్వయంగా కోటి మహాలక్ష్మి మంత్ర జపం నిర్వహించి, జప పూర్ణాహుతి యజ్ఞాన్ని కూడా నిర్వహించినట్లు తెలిపారు. వేలాది మందికి క్రియాయోగ, ధ్యాన దీక్షలుపరాశక్తిక్రియాయోగ మంత్ర దీక్షలు, సమర్థ సద్గురు స్పర్శ ధ్యాన దీక్షలను వేలాది మందికి అందించారు. విద్యా సంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆధ్యాత్మికతతో పాటు యోగ, ధ్యాన విద్యపై అవగాహన కల్పిస్తూ యువతలో విలువలతో కూడిన జీవన విధానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. **గురు పరంపర ఆశీస్సులతో ఆధ్యాత్మిక సేవ** గాయత్రి పరివార్‌కు చెందిన మారెళ్ల రామకృష్ణ గురుదేవుల అనుగ్రహంతో, అఖండ గురుసత్తాలో భాగంగా భగవాన్ రమణులు, అరబిందోసావిత్రి, పండిత శ్రీరామ శర్మ ఆచార్య, మాస్టర్ సి.వి.వి., మేడం బ్లావట్స్కీ, యోగానంద, లాహిరి మహాశయ, మహావతార్ బాబా తదితర ఆధ్యాత్మిక గురువుల ఆశీస్సులతో సమాజ శ్రేయస్సు కోసం తన జీవితాన్ని ఆధ్యాత్మిక రంగానికి అంకితం చేసినట్లు ఆదూరి ఉదయ భాస్కర్ తెలిపారు. డాక్టరేట్‌తో బాధ్యత మరింత పెరిగింది గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆదూరి ఉదయ భాస్కర్ మాట్లాడుతూ ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఇప్పటివరకు అందించిన ఆధ్యాత్మిక సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తూ, తన పూర్తి జీవితాన్ని సనాతన ఆధ్యాత్మిక సేవకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక జ్ఞానం, యోగ, ధ్యానం, మానవతా విలువలను సమాజంలో మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో లభించిన ఈ గౌరవం తన ఆధ్యాత్మిక సేవలకు మరింత ప్రోత్సాహాన్ని అందించిందని తెలిపారు.




---

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**పెనుబల్లి, ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ, నియోజకవర్గంలోని సుమారు 60 వేల కుటుంబాలకు బీఆర్ఎస్ బాకీ కార్డులను అందించాలని సూచిం చారు. 100 రోజుల్లో 13 డిక్లరేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని సండ్ర విమర్శించారు. రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బోనస్, యూరియా, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, విద్యా భరోసా, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల వంటి హామీల పరిస్థితి ఏమైందని ఆయన ప్రశ్నించారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వివిధ యాప్‌లు, నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సండ్ర మండిపడ్డారు. ధరణి స్థానంలో భూ భారతి తీసుకొస్తామని చెప్పి రైతుల భూ సమస్యలను మరింత సంక్లిష్టం చేశారని ఆయన ఘాటుగా విమర్శించారు. భూ సమస్యల పరిష్కారం పేరుతో రైతులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేశామని, అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడినే ప్రాతిపదికగా తీసుకుని పథకాలు అందించామని సండ్ర అన్నారు.

అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల రాజకీయ నేపథ్యాన్ని చూసి సంక్షేమ పథకాలు అందించే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. 1000 రోజుల సమయం ఇచ్చాం.. ఇక ప్రజల్లోకి వెళ్లాల్సిన సమయం వచ్చింది అని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రతి కుటుంబానికి వివరించాలి అన్నారు. బీఆర్ఎస్ బాకీ కార్డులను ప్రజలకు అందించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీయాలి అని సండ్ర వెంకట వీరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని ఆయన సూచించారు.

---

# శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా గుగులోతు లచ్చిరాం.. కొత్త కమిటీకి బాధ్యతలు





**మల్లంపల్లి, ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో మల్లంపల్లి మండలంలోని శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. మల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వాకిటి రామకృష్ణారెడ్డి, ్రాూజూ చైర్మన్ బొక్క సత్తిరెడ్డితో పాటు జోషి, రాము, జింక వేణు తదితరులు హాజరయ్యారు. శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా గుగులోతు లచ్చిరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కొట్టే ఆనందం, ప్రధాన కార్యదర్శిగా పంచగిరి రాజు, సహాయ కార్యదర్శిగా బానోతు మోహన్, కోశాధికారిగా బిలావత్ దేస్య ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా అజ్మీర రాజేందర్, గుగులోతు బిక్షపతి, గుగులోతు సుందర్, తోట కిరణ్ రాజ్, దాసరి రాజయ్య, మొగిలగాని రమేష్, బిలావత్ దశ్రు, కొట్టే కుమార్ స్వామి, తోట బిక్షపతి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. **కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం** ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి శ్రీనగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో జరిగే ప్రతి ఎన్నికలో శ్రీనగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సాధించే దిశగా నూతన కమిటీ, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీకి బలమైన పునాది వేయడంలో నూతన కమిటీ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్న చేయూత..పెద్ద భరోసా

- దివ్యాంగ దంపతులకు మార్పు అండ
- కష్టాలలో కిష్టయ్య కుటుంబం
- మానవత్వంతో ముందుకు వచ్చిన మార్పు
- క్రిష్టయ్య కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం.. పండ్ల పంపిణీ
- సాయం కోసం దాతలు ముందుకు రావాలని పిలుపు
- సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత




**తల్లాడ, ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో ఉన్న దివ్యాంగ కుటుంబానికి అండగా నిలిచి మార్పు స్వచ్ఛంద సంస్థ మానవత్వాన్ని చాటుకుంది. తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగ దంపతులు తేలపుట్ట క్రిష్ణయ్య, ప్రమీల కుటుంబానికి సంస్థ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సాయంతో పాటు పండ్లను అందజేశారు. పుట్టుకతోనే దివ్యాంగుడైన క్రిష్ణయ్య సైకిళ్లకు పంచర్లు వేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దివ్యాంగురాలైన ప్రమీలను వివాహం చేసుకున్న ఆయన ఇద్దరు పిల్లలతో గొల్లగూడెం గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల క్రిష్ణయ్య ఆరోగ్యం మరింత క్షీణించి, కాళ్లు చేతులు చచ్చుబడటంతో ఉపాధి పొందడం కష్టంగా మారింది. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా మారి జీవనం సాగించడం భారంగా మారింది. ఈ విషయం మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మోహన్‌రావు దృష్టికి రావడంతో సోమవారం ఆమె సంస్థ సభ్యులతో కలిసి క్రిష్ణయ్య నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా క్రిష్ణయ్య కుటుంబానికి సంస్థ తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయంతో పాటు పండ్లను అందజేసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గుడిమెట్ల రజిత మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి చేసే చిన్న సహాయం కూడా వారి జీవితంలో ఎంతో పెద్ద మార్పును తీసుకురాగలదని అన్నారు. మానవత్వంతో దాతలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి క్రిష్ణయ్య కుటుంబానికి మరింత సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ సభ్యులు గుండ్ల గోపాలకృష్ణ, సంగెపు యాలాద్రి, అనుమోలు చంద్రం, జాలాది తిరుపతిరావు, గుత్తికొండ శ్రీనివాస్‌రావు, గుత్తికొండ శ్రీదేవి, క్రిష్ణయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

PCW తెలుగు దినపత్రిక



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక

**● కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ● కార్యాలయంలో వినతుల స్వీకరణ ● ఫిర్యాదులపై సత్వర చర్యలకు అధికారులకు ఆదేశాలు**




**కల్లూరు, ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలు, ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించిన సబ్ కలెక్టర్, ఆయా సమస్యలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల సమస్యలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో స్పందిస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, అందిన ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడం ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి

**● కూతురి పెళ్లి వేడుకలో సేవలందించిన కార్మికులకు నూతన వధూవరుల చేతుల మీదుగా చీరల పంపిణీ**





**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** పెళ్లిళ్లు, పండుగలు, శుభకార్యాలంటే సందడి బంధుమిత్రుల రాకపోకలు.. విందు భోజనాలతో ఆ ప్రాంతమంతా కళకళలాడుతుంది. అయితే ఈ సందడికి వెనుక నిశ్శబ్దంగా శ్రమించే పారిశుధ్య కార్మికుల సేవలు చాలాసార్లు మరుగునపడుతుంటాయి. అలాంటి వారి సేవలను గుర్తించి, వారికి ఆత్మీయతతో గౌరవం అందించారు మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన కత్తి మొగిలి కుటుంబ సభ్యులు.అయితే ఇటీవల వారి కూతురి వివాహం జరిగింది. వివాహ వేడుక సందర్భంగా వచ్చిన అతిథులు, బంధువులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు తమ వంతు సేవలందించారు. వారి శ్రమను గుర్తించిన మొగిలి కుటుంబం సాధారణంగా పెళ్లి వేడుకల్లో ఇచ్చే బహుమతులకు భిన్నంగా, సేవలందించిన పారిశుధ్య కార్మికులను గౌరవించాలనే ఆలోచనతో నూతన వధూవరుల చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు చీరలను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మొగిలి మాట్లాడుతూ శుభకార్యాలు విజయవంతంగా నిర్వహించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర చాలా అవసరమని అన్నారు. తాము సంతోషంగా జరుపుకునే వేడుక వెనుక వారు చేస్తున్న శ్రమను గుర్తించడం మా యొక్క బాధ్యత అని తెలిపారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**● షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● 3వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన ఇంటి గృహప్రవేశం ● హాజరైన మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి**



**షాద్ నగర్,ఆగస్టు31(పీసీడబ్ల్యూ న్యూస్):** షాద్‌నగర్ మున్సిపాలిటీ 3వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన బుచ్చయ్యభారతమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్‌లతో కలిసి నూతన గృహంలో గృహప్రవేశం నిర్వహించి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నూతన గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్ పెంటయ్య, మురళీమోహన్ రాజు నాయక్, కొప్పునూరి ప్రవీణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, ముబారక్ అలీ ఖాన్, చందులాల్, కత్తి చంద్రశేఖరప్ప, సీతారాం, తుపాకుల శేఖర్, శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కొత్తపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశంకు ఘన స్వాగతం

**కొత్తపల్లి,ఆగస్టు31(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా కొత్తపల్లి గ్రామానికి విచ్చేసిన సాయిని మల్లేశంకు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీజేపీ రాష్ట్ర పార్టీ సమావేశానికి బయలుదేరిన సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గ్రామంలోని బూత్ అధ్యక్షులు, బూత్ బాధ్యులు, పార్టీ



కార్యకర్తలతో జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

సమావేశమయ్యారు. పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై నాయకులతో చర్చించారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువ కావాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్, తిమ్మాపూర్ మండల మాజీ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరచారి, జిల్లా నాయకులు గుంజేటి శివకుమార్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్, కొత్తపల్లి గ్రామ బూత్ అధ్యక్షుడు మార్క శ్రీనివాస్, బీఎల్-2 బాధ్యులు గడ్డం లక్ష్మణ్, మార్క శ్రీకాంత్, జెల్ల విజయ్, నోముల మల్లేష్, దుంబాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం: బండి సంజయ్.






**కరీంనగర్ టౌన్ ఆగస్టు31(పీసీడబ్ల్యూ న్యూస్):** నగర శివారు ప్రాంతాల్లో గల్లీగల్లీలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి కరీంనగర్‌ను అభివృద్ధిలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.కరీంనగర్ 45వ డివిజన్ మంకమ్మతోటలో రూ.70 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న డ్రెయిన్ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్రం నుంచి కరీంనగర్ అభివృద్ధికి భారీగా నిధులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. రూ.630 కోట్ల యూసీఎఫ్ నిధులతో సుమారు 50 కి.మీ మేర మోడల్ రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. జిల్లా కోర్టు, సివిల్ ఆసుపత్రి, గీతాభవన్ వద్ద మూడు ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, బస్‌స్టేషన్ వద్ద స్కైవాక్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే నగరంలో 80 కి.మీ మేర స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, రూ.80 కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు తెలిపారు. 130 ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసి కాలుష్యరహిత రవాణాకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఏడేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.22 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు.

# ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సర్దార్ రవీందర్ సింగ్

**తండ్రి లేని నిరుపేద దళిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం నూతన వధూవరులకు ఆశీర్వాదం**

**కరీంనగర్, ఆగస్టు 31 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలో చూపిస్తూ కరీంనగర్ మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ మరోసారి తన ప్రజా నిబద్ధతను చాటుకున్నారు.58వ డివిజన్ సిఖ్వాడిలో నివసించే తండ్రి లేని నిరుపేద దళిత కుటుంబానికి చెందిన దేవునూరి సత్తమ్మ(కీ.శే.) లింగయ్య దంపతుల కుమార్తె చిలసౌ పద్మ, చందు చారి వివాహ వేడుకకు సర్దార్ రవీందర్ సింగ్ స్వయంగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, కుటుంబానికి ఆర్థికంగా



అండగా నిలిచారు.మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆడబిడ్డ వివాహానికి రూ.25,000 ఆర్థిక సహాయంతో పాటు పట్టుచీరను కానుకగా అందజేశారు. దీంతో కడు బీదరికంలో ఉన్న ఆ కుటుంబానికి ఆయన సహాయం చేయడం పట్ల కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ, "ప్రజలు నమ్మి వేసిన ప్రతి ఓటు నాకు ఒక బాధ్యత. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే నిజమైన ప్రజాసేవ. వరుసగా ఆరు సార్లు నన్ను గెలిపించిన నగర ప్రజల విశ్వాసాన్ని ఎప్పటికీ నిలబెట్టుకుంటాను" అని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, కుటుంబంలో ఒకరిగా వివాహ వేడుకకు హాజరై ఆర్థిక సహాయం అందించిన సర్దార్ రవీందర్ సింగ్‌కు కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**- ప్రజాపాలన పేరుతో ప్రజా వ్యతిరేక విధానాలు: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణ్ చంద్ర**

**కరీంనగర్ టౌన్ ఆగస్టు31(పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో చెప్పుకోదగిన ఫలితాలు సాధించలేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కళ్యాణ్ చంద్ర విమర్శించారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొందని ఆయన పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఇటీవల భూములకు సంబంధించి 22-ఏ నిబంధనల అమలు కారణంగా భూ యజమానులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని కళ్యాణ్ చంద్ర అన్నారు. సొంత భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా ప్రజల్లో ఆందోళన నెలకొంటోందని విమర్శించారు.విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా విద్యార్థులు, కళాశాలలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. యువతకు సంబంధించిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు.ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రతిపక్షాలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ప్రాధాన్యత ఇస్తోందని కళ్యాణ్ చంద్ర ఆరోపించారు. కాంగ్రెస్ పాలనను ప్రజాపాలనగా చెప్పుకోవడం సరికాదని, ఇది ప్రజా వ్యతిరేక పాలనగా మారిందని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పాలనలోని వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి, ప్రభుత్వంపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని కళ్యాణ్ చంద్ర హెచ్చరించారు.



# సెప్టెంబర్ 9న 'చలో వరంగల్'ను విజయవంతం చేద్దాం

**• ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభకు**

**భారీగా తరలిరావాలి: బోయ లింగస్వామి మాదిగ**



**చౌటుప్పల్:ఆగస్టు31(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న వరంగల్ వేదికగా నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్, నారాయణపురం మండలాల ఇన్‌చార్జి బోయ లింగస్వామి మాదిగ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌లో నిర్వహించనున్న జాతీయ మహాసభ ఎమ్మార్పీఎస్ భవిష్యత్ ఉద్యమాలకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలుస్తుందని తెలిపారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యమాలు, కార్యాచరణకు ఈ మహాసభలో కీలకమైన మార్గనిర్దేశం జరుగుతుందని పేర్కొన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు, ఎమ్మెస్పీ మండల అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర బాధ్యులు పెద్ద సంఖ్యలో వరంగల్‌కు తరలివచ్చి జాతీయ మహాసభను విజయవంతం చేయాలని బోయ లింగస్వామి మాదిగ విజ్ఞప్తి చేశారు.మాదిగల హక్కులు, సామాజిక న్యాయం కోసం కొనసాగుతున్న ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

# లెమర్ స్కూల్‌లో రంగురంగుల ఓణం వేడుకలు







**కల్లూరు, ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** లెమర్ ఎడ్యుకేషనల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలోని సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ లో ఓణం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం కేరళ సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా సందడిగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఓణం పండుగ విశిష్టతను చాటిచెప్పారు. విద్యార్థులు రూపొందించిన ఆకర్షణీయమైన పూల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అందరినీ అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ హసన్ మాట్లాడుతూ, ఓణం పండుగ కేరళ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంప్రదాయాలు, విభిన్న సంస్కృతుల పట్ల అవగాహనతో పాటు గౌరవభావం పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో ఓణం పండుగ ఆనందం, శాంతి, ఐక్యత, సంతోషాన్ని నింపాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆకాంక్షిస్తూ అందరికీ ఓణం శుభాకాంక్షలు తెలిపారు.

# బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ దాడి అప్రజాస్వామికం

**అధికారాన్ని అడ్డుపెట్టుకొని దాడులు చేయడం కాంగ్రెస్ విష సాంస్కృతికి నిదర్శనం : కత్తి హరీష్ గౌడ్**



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 31(పిసిడబ్ల్యూ న్యూస్):** నిత్యం ప్రజాస్వామ్యం రాజ్యాంగం ప్రజల హక్కుల గురించి నీతులు చెప్పే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని బిజెపి సీనియర్ నాయకుడు కత్తి హరీష్ గౌడ్ ప్రశ్నించారు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణులు చేసిన అప్ర ప్రజాస్వామిక దాడిని తీవ్రంగా ఖండించారు. బిజెపిని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ అల్లరి మూకలను ప్రోత్సహిస్తూ రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడులు చేయించే స్థాయికి దిగజారిందని హరీష్ గౌడ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు తమ భావాలను వ్యక్తం చేసే హక్కు ఉందని అయితే ప్రత్యర్థి పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు దేశవ్యాప్తంగా రాజ్యాంగం ప్రజాస్వామ్య హక్కుల గురించి మాట్లాడే కాంగ్రెస్ అభ్యత రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న దాడులను ఖండించే దమ్ము ఉందా అని కత్తి హరీష్ గౌడ్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ఉపన్యాసాలు ఇవ్వడం కాకుండా తమ పార్టీ కార్యకర్తలు చట్టాన్ని చేతులకు తీసుకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయ గేట్లపై నల్ల రంగు పూయడం కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సంక్షేమం అభివృద్ధి కోసం వినియోగించాల్సిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు దాడులకు పాల్పడటం సరికాదన్నారు. బిజెపి కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దు బిజెపి కార్యకర్తలు ఇప్పటివరకు సంయమనంతో నివసిస్తున్నారని తమ సహనాన్ని బలహీనతగా భావించొద్దని హరీష్ గౌడ్ హెచ్చరించారు. బిజెపి కార్యకర్తలు కూడా ఎదురు దాడులకు దిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు కూడా మిగలవని తీవ్ర వ్యాఖ్యలు చేశారు అయితే రాజకీయ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతుల్లోని జరగాలని దాడులు హింసకు తావివ్వకూడదని ఆయన స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని రాజకీయ కక్ష సాధింపులు దాడుల సంస్కృతిని విడనాడాలని కత్తి హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా 'ఫ్లేవర్ ఆఫ్ ఇండియా' వేడుకలు





**హైదరాబాద్ ఆగస్టు 31(పిసిడబ్ల్యూ న్యూస్):** బర్కత్‌పురాలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ (నారాయణగూడ జోన్)లో 'ఫ్లేవర్ ఆఫ్ ఇండియా ఎ సెలబ్రేషన్ ఆఫ్ ఇండియాస్ డైవర్సిటీ' పేరిట సాంస్కృతిక వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 'మేరా భారత్ శ్రేష్ఠ భారత్' స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ మరియు దేశభక్తి మాసోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, సాంస్కృతిక అవగాహన, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల వ్యవస్థాపక చైర్‌పర్సన్లు డాక్టర్ బి.ఎస్. రావు, డాక్టర్ ఝాన్సీ లక్ష్మి బాయిల స్ఫూర్తితో ఈ వేడుకలు జరిగాయి.కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, జమ్మూ-కశ్మీర్, ఒడిశా, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను, కళారూపాలను సంప్రదాయ వస్త్రధారణతో కూడిన నృత్య ప్రదర్శనల ద్వారా కళ్లకు కట్టారు. విద్యార్థుల ప్రదర్శనలు పాఠశాల ప్రాంగణంలో 'మినీ భారత్'ను తలపించాయి.ఈ కార్యక్రమంలో ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ, ఆర్ఐ బండి వెంకటేష్, ప్రిన్సిపాల్ ఎ. మాధవి, డీన్ గాయత్రి, ప్రైమరీ ఇన్‌చార్జ్ సబిత, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ మాలతితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీపీ గౌష్ ఆలం ఆకస్మిక తనిఖీ.







**కరీంనగర్ టౌన్ ఆగస్టు31(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడిన సీపీ.. వారికి కేటాయించిన విధులు, నిర్వహిస్తున్న బాధ్యతలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, నమోదైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు జజుచీలో నమోదు చేయాలని ఆదేశించారు.తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన జజుచీ-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్లు, TS`COP, HRMS, e`Saakshya, TechDatum, iRAD, <SsÁÎDY, CEIR, సైబర్ క్రైమ్ సాఫ్ట్‌వేర్, CDR తదితర సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోజువారీ విధుల్లో టెక్నాలజీని విస్తృతంగా వినియోగించి పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం ఎఫ్ఐఆర్ ఇండెక్స్, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించిన కమిషనర్.. కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తులను వేగవంతం చేసి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిని సెక్టార్లు, సబ్-సెక్టార్లుగా విభజించి, ఆయా ప్రాంతాలకు విలేజ్/ఏరియా పోలీస్ ఆఫీసర్లను కేటాయించి ప్రజలకు పోలీసుల అందుబాటును మరింత పెంచాలని ఆదేశించారు.అదేవిధంగా రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి నెలా తాజా సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సీపీ గౌష్ ఆలం సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీలో త్రీ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తిరుమల్ గౌడ్తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణికి 5 దరఖాస్తులు... సమస్యల పరిష్కారానికి చర్యలు




**కల్లూరు, ఆగస్టు 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో, నోడల్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 20 మంది అధికారులు హాజరయ్యారు.మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 5 దరఖాస్తులు అందాయి. అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, వాటి పరిష్కారానికి నిబంధనల మేరకు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ఆశావహుల దరఖాస్తులు

**కరీంనగర్, ఆగస్టు 31 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్, కొత్తపల్లి మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయ పీఆర్వో నాత శ్రీనివాస్ ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో భాగంగా సెప్టెంబర్ 1, మంగళవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం, పీసీసీ పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్, ఖాజా ఫక్రుద్దీన్ దరఖాస్తు చేసుకున్న ఆశావహులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం వారి అభిప్రాయాలను పరిశీలించి ఇరువురు మండలాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.కరీంనగర్ రూరల్ మండలం నుంచి దరఖాస్తులు:బొంగోని గోపాల్, గాండ్ల అంజయ్య, చల్ల మల్లారెడ్డి, మడ్డి రంగయ్య, కూర నరేష్ రెడ్డి, కస్తూరి అశోక్ రెడ్డి.కొత్తపల్లి మండలం నుంచి దరఖాస్తులు:పెంట శేఖర్, పంజాల స్వామి గౌడ్, సిరిపురం నాగప్రసాద్, బోనాల అశోక్ కుమార్, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాజా గౌడ్, రంగన వేణి రవీందర్.మండల అధ్యక్ష పదవుల కోసం పలువురు నాయకులు దరఖాస్తు చేసుకోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. మంగళవారం జరిగే సమావేశం అనంతరం నూతన మండల అధ్యక్షులపై స్పష్టత రానుంది.



# బిజెపి అంటరానితనాన్ని ప్రోత్సహిస్తుంది

● బిజెపి మతోన్మాదులు దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారు. ● హిందువులంతా బంధువులే అనే బండి సంజయ్ వెంటనే సమాధానం చెప్పాలి. ● దళితులను అవమానపరిస్తే చూస్తూ ఊరుకోం. ● హల్ద్వానీ ఘటన బాధ్యులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని టు టౌన్ పి.ఎస్.లో ఫిర్యాదు ● కొరివి అరుణ్ కుమార్ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు. ● ఈ దేశంలో అంటరానితనాన్ని ప్రోత్సహిస్తూ, మతం పేరిట కులం పేరిట భారతీయ జనతా పార్టీ ● దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తుందని దళితులను అవమానపరిస్తే చూస్తూ ఊరుకోము. ● కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్.








**కరీంనగర్ టౌన్ ఆగస్ట్ 31(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆగస్టు 8వ తేదిన ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఉత్తరాఖండ్ లోని రామ్ లీలా మైదానంలో సభను నిర్వహించిన తర్వాత బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు ఆ సభా స్థలాన్ని శుద్ధికరణ పేరుతో గంగాజలంతో గోమూత్రంతో శుద్ధిచేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. టి.పి.సి.సి ఎస్ సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ పక్షాన ఉత్తరాఖండ్ హల్ద్వానీ లో మల్లికార్జున ఖర్గే గారికి జరిగిన అవమానాన్ని ఖండిస్తూ బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారి మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ కేసు నమోదు చేయాలని ఆయన స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఈ దేశంలో దళితులు హిందువులు కాదా, గడప లోపల కులం గడప దాటితే హిందువులం అని నినాదాలు పలికే బీజేపీ నాయకులకు దళితులు హిందువులుగా కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాదులు చేసిన ఈ శుద్ధీకరణ కార్యక్రమం పై కరీంనగర్ ఎంపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించాలని ఆయన సవాలు విసిరారు. ఇది కేవలం మల్లికార్జున ఖర్గే గారికి జరిగిన అవమానం మాత్రమే కాదని యావత్ దళిత జాతికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా, బిజెపి నాయకులు ఏ ముఖం పెట్టుకొని దళితుల ఓట్లు అడుగుతారో సమాధానం చెప్పాలి అని ఆయన ప్రశ్నించారు. హల్ద్వానీ ఘటన బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాబోయే రోజుల్లో బిజెపి నాయకుల ఇండ్లు ముట్టడించి వారిని రోడ్లపై తిరగకుండా చేస్తామని ఆయన హెచ్చరించారు. హిందువులంతా బంధువులే అని హితవు పలికే బండి సంజయ్ కి హల్ద్వానీ ఘటన కనిపించడం లేదా అని ఆయన ఎద్దేవా చేశారు. ఇకనైనా కులాల పేరిట మతాల పేరిట రాజకీయాలు మానుకోవాలని లేకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ముఖ్యంగా దళితుల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని దళితులను అవమానపరిస్తే దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందని ఆయన గుర్తు చేశారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్, మాజీ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, దళిత కాంగ్రెస్ నాయకులు వెన్న రాజమల్లయ్య, సముద్రాల లక్ష్మణ్, మాతంగి అనిల్, జీడి రమేష్, మీసాల సాయిలు, దుబ్బాసి కుమార్, హస్త పురం రమేష్, ధ్యావ ప్రభాకర్, కనకం విద్యాసాగర్, గొట్టే బాబు ప్రణవ్,అరుణ్, పిల్లి అశోక్, వేల్పుల అనూష తదితరులు పాల్గొన్నారు.

---

# రాహుల్ గాంధీపై అక్రమ FIRకు నిరసనగా కరీంనగర్ DCC ఎదుట కాంగ్రెస్ ఆందోళన

**ఖర్గే అవమానంపై ప్రశ్నిస్తే రాహుల్ పై కేసా?**

**- కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులద**

**వైద్యుల అంజన్ కుమార్**

**బీజేపీ కక్షపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా కరీంనగర్ లో కాంగ్రెస్ నిరసన**

**రాహుల్ గాంధీ పై అక్రమ FIRకు నిరసనగా కరీంనగర్ డిసిసి కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆందోళన**



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 31(పిసిడబ్ల్యూ న్యూస్):** హల్ద్వానీలో ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ర్యాలీ వేదిక వద్ద బీజేపీ–ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చేసిన కులతత్వ "శుద్ధీకరణ ఆచారం" ను ఖండించి నందుకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్ లోని హల్ద్వానీ సిటీ కోత్వాలి పోలీస్ స్టేషన్ లో బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా FIR నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు డీసీసీ కార్యాలయం, కరీంనగర్ వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లతోపాటు జిల్లా కాంగ్రెస్ అనుబంధం సంఘాల అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు హాజరైనారు, సందర్భంగా కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ.."రాజ్యాంగ విలువలను అవమానించిన దోషులపై చర్యలు తీసుకోకుండా, వారిని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై కేసు పెట్టడం బీజేపీ దుర్మార్గానికి నిదర్శనం. కుల ఆధారిత వివక్షను, దళితులపై అఘాయిత్యాలను ప్రశ్నిస్తే అణచివేయాలని చూడ టం బీజేపీ నైజం. ప్రభుత్వ ప్రేరేపిత వేధింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదు. సామాజిక న్యాయం, రాజ్యాంగ సమానత్వం కోసం మా పోరాటం కొనసాగుతుంది. వెంటనే రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ FIRను ఎత్తివేసి, అసలు దోషులైన బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయాలి" అని డిమాండ్ చేశారు. నాయకులు సిరాజ్ హుస్సేన్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, పర్వత మల్లేశం, కాంతల జగన్ రెడ్డి, వరాల నర్సింగం, ఆకుల ఉదయ్, ముసుకు ఉపేందర్ రెడ్డి, విక్రమ్, కొమ్మెర రవీందర్ రెడ్డి, దిండిగాల మధు, లాయి కు, ఖలీముద్దీన్, మూల కృష్ణారెడ్డి, గుర్రం వాసు, కిమ్ ఫహాద్,అబ్దుల్ రహమాన్, అమీర్, వంగల విద్యా సాగర్, మేకల నరసయ్య, సత్తినేని శ్రీకాంత్, సిరిపురం లావణ్య నాగప్రసాద్, బషీరుద్దీన్, అబ్దుల్ గని, గడప అజయ్, గడప శ్రీనివాస్, మాలోతు మహాలక్ష్మి, శిల్ప, పెంట శేఖర్, సుకుర్, ఇమ్రాన్ ఘని, పాల్గొన్నారు.

---

## పోలీసు కమిషనర్ గౌష్ఆలంను ఆత్మీయంగా సన్మానించిన సున్నీ మర్కజి మీలాద్ కమిటీ..వ బజ్మ్ అఫ్జల్ బియాబాని

**● పోలీసు శాఖకు హృదయ పూర్వక కృతజ్ఞతలు**



**కరీంనగర్, ఆగస్టు 31(పిసిడబ్ల్యూ న్యూస్):** మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నగరంలో ఇటీవల నగరంలో నిర్వహించిన మిలాదున్నబి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, శాంతి ర్యాలీకి, సహాయ సహకారాలు అందించిన పోలీసు కమిషనర్ గౌష్ ఆలంను ఆయన క్యాంపు కార్యాలయంలో, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, వ బజ్మ్ అఫ్జల్ బియాబాని అధ్యక్షుడు మౌలానా అలీముద్దీన్ నిజామీ బియాబాని ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసు శాఖ ఇచ్చిన గడువు ప్రకారం, సరైన సమయానికి, పోలీసులు సూచనలు పాటిస్తూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా మిలాదున్నబి జల్సా, నాత్, దరూద్ కి మహిఫీల్, ఖసీదా బుర్దా షరీఫ్ సదస్సులు నిర్వహించి ఆదర్శంగా నిలిచామన్నారు. యావత్తు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు మౌలానా ఖయ్యుం జియాయి, మౌలానా అబుల్ కలాం మిస్బాహి, సయ్యద్ అబ్బాస్ హుస్సేన్, సలావుద్దీన్, ఆయుబ్ ఖాన్, నూరి, జియా, తఖీ తదితరులు పాల్గొన్నారు.





---

# రాహుల్ గాంధీపై పెట్టిన వివక్షపూరిత ఎఫ్ఐఆర్‌ను వెంటనే రద్దు చేయాలి

**ఖర్గే సభా ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేసిన బీజేపీఆర్ఎస్ఎస్ నాయకులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలి: డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

**హన్మకొండ ఆగస్టు 31(పిసిడబ్ల్యూ న్యూస్):** డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు,రాహుల్ గాంధీ పై నమోదైన వివక్షపూరిత ఎఫ్ ఐ ఆర్ ను నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి హనుమకొండ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి,రహదారి నిర్బంధం చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పై పెట్టిన ఎఫ్ ఐ ఆర్ ను వెంటనే రద్దు చేయాలని,ఖర్గే సభా ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేసిన బీజేపీఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల మాట్లాడుతూ దళితులు,అణగారిన వర్గాలు,సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పై వివక్షపూరితంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దళితులు,బలహీన వర్గాలు,సామాజికంగా వెనుకబడిన ప్రజల హక్కులు,ఆత్మగౌరవం కోసం రాహుల్ గాంధీ బలంగా మాట్లాడుతున్నందుకే ఆయనను రాజకీయ కక్షతో లక్ష్యంగా చేసుకుని వివక్షపూరితంగా ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారని ఆరోపించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న కార్యక్రమం జరిగిన సభా ప్రాంగణాన్ని బీజేపీఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తులు గంగాజలంతో శుద్ధి చేయడం ద్వారా దళితుల పట్ల తమ కుల వివక్ష భావజాలాన్ని బహిరంగంగా ప్రదర్శించారని అన్నారు. ఈ ఘటనపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయం నుంచే డిమాండ్ చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ఒకవైపు దళితుల హక్కుల కోసం మాట్లాడిన రాహుల్ గాంధీ పై వెంటనే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం,మరోవైపు దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించిన బీజేపీఆర్ఎస్ఎస్ వ్యక్తులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయకపోవడం చూస్తుంటే పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని అన్నారు. రాహుల్ గాంధీ దళితుల పక్షాన మాట్లాడటం నేరమా? కుల వివక్షకు వ్యతిరేకంగా గళం విప్పడం నేరమా?" అని నాయకులు ప్రశ్నించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మార్క విజయ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పై నమోదైన ఎఫ్ ఐ ఆర్ ను తక్షణమే రద్దు చేయాలని,ఖర్గే సభా ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేసిన బీజేపీఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తులపై వెంటనే ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి,చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. కుల వివక్షకు వ్యతిరేకంగా,రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా అండగా ఉంటుందని,దళితులు,బహుజనులు,అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడుతామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో డీసీసీ మీడియా కమిటీ చైర్మన్ మార్క విజయ్,లీగల్ సెల్ చైర్మన్ రాజకుమార్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి,కూరు వెంకటేశ్,ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు కొంకరి హరీబాబు, డి సి సి కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్,డివిజన్ అధ్యక్షులు భీమ వినయ్,మాజీ కార్పొరేటర్ నాగరాజు,సీనియర్ నాయకులు రహీమున్నీసా తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.





# వైభవ్ సూర్యవంశీ చేజారిన శతకం



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ (81 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 92)తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. దులీప్ ట్రోఫీ 2026లో ఈస్ట్ జోన్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బెంగళూరులోని బీసీసీఐ సీఓఈ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ.. వన్డే తరహా బ్యాటింగ్‌తో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన ఫియర్‌లెస్ బ్యాటింగ్‌తో మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపించాడు. తనకే సాధ్యమైన భారీ సిక్సర్లతో బౌలర్లకు చుక్కలు చూపించాడు. 42 బంతుల్లోనే 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో అర్ధశతకం పూర్తి చేసుకున్న వైభవ్.. ఫాస్టెస్ట్ సెంచరీ దిశగా సాగాడు. కానీ హర్ష్‌దూబే బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. బౌండరీ లైన్‌పై అర్షద్ ఖాన్ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ముగిసింది. 8 పరుగుల దూరంలో సెంచరీ చేజారడంతో వైభవ్ సూర్యవంశీ తీవ్ర అసహనానికి గురయ్యాడు. మైదానం వీడే క్రమంలో బ్యాట్‌ను బలంగా నేలకు కొట్టి అసహనం వ్యక్తం చేశాడు. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ బాదిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ చరిత్రకెక్కాడు. 15 ఏళ్ల 175 రోజుల వయసులో వైభవ్ ఈ ఘనత సాధించి 57 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 1969లో లక్ష్మణ్ సింగ్ 16 ఏళ్ల 23 రోజుల వయసులో దులీప్ ట్రోఫీలో హాఫ్ సెంచరీ బాదగా.. ఆ రికార్డ్‌ను తాజాగా వైభవ్ సూర్యవంశీ అధిగమించాడు. అభిమన్యు ఈశ్వరన్‌తో కలిసి తొలి వికెట్‌కు వైభవ్ 161 పరుగులు జోడించాడు. కానీ అతను ఔటైన తర్వాత ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. మరో 105 పరుగులు మాత్రమే జోడించి 57 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్(69) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. సెంట్రల్ జోన్ బౌలర్లలో హర్ష్ దూబే(4/66) నాలుగు వికెట్లు తీయగా.. యశ్ ఠాకూర్, ఆర్యన్ పాండే మూడేసి వికెట్లు పడగొట్టారు. దాంతో ఈస్ట్ జోన్‌కు ఒక్క పరుగు కూడా ఆధిక్యం దక్కలేదు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 20 ఓవర్లలో 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. కునాల్ చండేలా(2), ఆర్యన్ జుయాల్(8), రజత్ పాటిదార్(5) విఫలమవ్వగా.. క్రీజులో అమన్ మోకడే(23 బ్యాటింగ్), ఆర్యన్ పాండే(4 బ్యాటింగ్)లు ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్ రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సెంట్రల్ జోన్.. 80.1 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రింకూ సింగ్(88 బంతుల్లో 8 ఫోర్లతో 60) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఆర్య జుయల్(113 బంతుల్లో 6 ఫోర్లతో 46) హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో ముఖేష్ కుమార్(3/56), అభిజిత్ సర్కార్(3/38) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, మహమ్మద్ కౌనైన్ రెండేసి వికెట్లు తీసారు.

# హార్దిక్, నితీష్ రెడ్డి రీఎంట్రీ!

శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచిన భారత్.. మళ్లీ వైట్ బాల్ ఫార్మాట్‌కు సిద్ధమైంది. సొంతగడ్డపై సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య అఫ్గానిస్థాన్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సిరీస్ ఆడే భారత జట్టును బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. అజిత్ అగార్కర్ సారథ్యంలో సెలెక్షన్ కమిటీ.. టీమ్ ఎంపికపై ఫోకస్ పెట్టింది. మరో రెండు రోజుల్లో జట్టును ప్రకటించే అవకాశం ఉంది. గాయాలతో జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ)లో ఉన్న సంగతి తెలిసిందే. వాషింగ్టన్ సుందర్ సీవోఈలో ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం అతను చెన్నైలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. మరోవైపు జస్‌ప్రీత్ బుమ్రా పూర్తిగా కోలుకున్నా.. అతని విషయంలో టీమ్‌మేనేజ్‌మెంట్ ఆచితూచి వ్యవహరిస్తోంది. భవిష్యత్తులో కీలక టెస్ట్ టెస్ట్ సిరీస్‌లు ఉన్న నేపథ్యంలో అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు బుమ్రాను దూరంగా ఉంచే అవకాశాలు ఉన్నాయి. 'అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్ కోసం జట్టు ఎంపికపై సెలెక్షన్ కమిటీ ఫోకస్ పెట్టింది. గాయాల నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించే ఆటగాళ్లను పరిగణనలోకి తీసుకుంటారు. నితీష్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా చాలా రోజుల నుంచి సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నారు. వ్యక్తిగత కమిట్‌మెంట్స్ కోసం అప్పుడప్పుడు బయటకు వెళ్లినా ఎక్కువ సమయం సీఓఈలోనే గడిపారు. హార్దిక్ పాండ్యా అయితే బెంగళూరులోనే స్థిరపడ్డాడు. సుందర్ కూడా ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సెలెక్షన్స్‌కు అందుబాటులోకి వస్తాడు.'అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా పేరును కూడా సెలెక్టర్లు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బ్యాటింగ్ సామర్థ్యంతో పాటు టీ20 ఫార్మాట్‌కు తగ్గట్లు బౌలింగ్ చేసే కృనాల్‌ను టీమిండియాలోకి తీసుకోవాలని సెలెక్టర్లు భావిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన స్థానాన్ని నిలబెట్టుకోనున్నాడు. అఫ్గాన్‌తో భారత టీ20 జట్టు(అంచనా) వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), ఇషాన్ కిషన్, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్/గుర్నూర్ బ్రార్, కృనాల్ పాండ్యా/వాషింగ్టన్ సుందర్, యశ్ ఠాకూర్, ప్రసిధ్ కృష్ణ.




# తొలి రౌండ్‌లోనే ముగిసిన జకోవిచ్ ప్రయాణం

తీవ్రమైన ఎండ, తేమ, అనారోగ్యం, శారీరక అలసటతో పోరాడిన జకోవిచ్.. అర్జెంటీనా ఆటగాడు మరియానో ??నవోన్‌తో జరిగిన మారథాన్ ఐదు సెట్ల పోరులో 6-7, 7-5, 6-4, 2-6, 1-6 తేడాతో ఓటమిపాలయ్యాడు. ఆర్థర్ యాష్ స్టేడియంలో మ్యాచ్ ఆరంభం నుంచే జకోవిచ్ శారీరకంగా ఇబ్బంది పడుతూ కనిపించాడు. న్యూయార్క్‌లోని తీవ్ర ఉక్కపోత, తేమ వాతావరణం వల్ల తలపై పదే పదే ఐస్ బ్యాగ్ పెట్టుకున్నాడు. వర్షం కారణంగా స్టేడియం రూఫ్ మూసివేసినప్పుడు ఏసీ ఆన్ చేయాలని సూపర్వైజర్‌ను కూడా కోరాడు. మూడో సెట్ ఆరో గేమ్‌లో పరిస్థితి మరింత విషమించి, జకోవిచ్ కోర్టు వెనుకభాగంలో పలుమార్లు వాంతులు చేసుకున్నాడు. టోర్నమెంట్ ఫిజియో అతనికి మాత్రలు అందించగా, కోర్టు పక్కనుంచి సహాయక బృందం ద్రవాలు అందించింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో 6-7తో కోల్పోయినప్పటికీ, తీవ్రమైన శారీరక ఇబ్బందుల నడుమ జకోవిచ్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్‌ను 7-5తో, మూడో సెట్‌ను 6-4తో గెలుచుకుని విజయానికి కేవలం ఒక్క సెట్ దూరంలో నిలిచాడు. అయితే, యువ ఆటగాడు నవోన్ తగ్గకుండా నాలుగో సెట్‌ను 6-2తో గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఐదో సెట్‌లో నవోన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 4-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అప్పటికే శరీరం సహకరించక, శక్తి పూర్తిగా క్షీణించడంతో మ్యాచ్ చేజారిపోతోందని గ్రహించిన జకోవిచ్ కోర్టులోనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. గ్యాలరీలో ఉన్న ఆయన భార్య జెలెనా కూడా తీవ్ర ఆందోళనకు గురైంది. నవోన్ ఏమాత్రం తడబడకుండా ఐదో సెట్‌ను 6-1తో ముగించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. 25వ టైటిల్ కల నిరీక్షణ: మార్గరెట్ కోర్ట్ రికార్డును అధిగమించి 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ గెలవాలన్న జకోవిచ్ కల ఈ ఓటమితో ప్రస్తుతానికి ఆగింది. జిమ్మీ కానర్స్ రికార్డు మిస్: యూఎస్ ఓపెన్‌లో జిమ్మీ కానర్స్ పేరిట ఉన్న 98 విజయాల రికార్డును దాటడానికి జకోవిచ్‌కు ఇంకా నాలుగు విజయాలు అవసరమున్న సమయంలో ఈ ఓటమి ఎదురైంది. 18 ఏళ్ల అజేయ రికార్డుకు తెర: గ్రాండ్‌స్లామ్ టోర్నీల తొలి రౌండ్లలో వరుసగా 78 మ్యాచ్‌లు గెలిచిన జకోవిచ్ రికార్డుకు ఈ మ్యాచ్‌తో తెరపడింది. గతంలో 2006 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పాల్ గోల్డ్‌స్టీన్ చేతిలో ఓడిన తర్వాత, మళ్లీ ఇన్నాళ్లకు జకోవిచ్ గ్రాండ్‌స్లామ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు.

# అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

ఫుట్‌బాల్ ప్రపంచంలో సంచలన నిర్ణయం చోటుచేసుకుంది. అర్జెంటీనా స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించారు. ఇకపై అర్జెంటీనా జాతీయ జట్టు తరఫున మైదానంలో కనిపించబోనని ఆయన వెల్లడించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్‌తో ఓటమి ఎదురైన రెండు రోజుల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెస్సీ తెలిపారు. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. జాతీయ జట్టుకు దూరమవ్వాలనే నిర్ణయం ఎంతో బాధాకరంగా ఉందని మెస్సీ పేర్కొన్నారు. చాలా కాలంగా ఆలోచించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఇన్నేళ్లుగా అర్జెంటీనా జెర్సీ కోసం తన శక్తిమేర పోరాడానని, దేశ ప్రజలను సంతోషపెట్టడం, అర్జెంటీనాగా గర్వపడేలా చేయడం తనకు ఎప్పుడూ ముఖ్యమని వివరించారు. మెస్సీ తన ప్రకటనలో.. ఇది తనను తీవ్రంగా కలచివేసిన నిర్ణయమని, ఇప్పటికీ ఆ బాధ తనలో ఉందని తెలిపారు. ఇటీవలి సంవత్సరాల్లో జట్టుతో కలిసి ఎన్నో విజయాలు సాధించినప్పటికీ, అంతకుముందు కాలంలోనూ జాతీయ జట్టు కోసం పూర్తిస్థాయిలో కష్టపడ్డానని గుర్తుచేసుకున్నారు. తన అంతర్జాతీయ కెరీర్‌లో చివరి దశకు చేరుకున్నానని మెస్సీ అభిప్రాయపడ్డారు. కొన్ని అధ్యాయాలు ముగిసే సమయం వచ్చిందని, వాటిలో జాతీయ జట్టు అధ్యాయం ముగియడం తనకు ఎంతో బాధ కలిగిస్తోందన్నారు. అర్జెంటీనా జట్టులో భాగం



కావడాన్ని తాను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటానని చెప్పారు. తనవంతుగా ఇవ్వాల్సినదంతా ఇచ్చేశానని, ఇక తన స్థానాన్ని కొత్త తరం ఆటగాళ్లకు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. జాతీయ జట్టుకు మద్దతుగా నిలిచిన అభిమానులకు మెస్సీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్లుగా తనపై చూపిన ప్రేమ, మద్దతును ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. ఇకపై స్టేడియం లోపల నుంచి అభిమానుల గొంతులు వినడం మిస్ అవుతానని, అయితే బయట నుంచి అర్జెంటీనా జట్టుకు మద్దతు ఇస్తూ ఉంటానని తెలిపారు. మంచి సమయాల్లోనే కాకుండా, ముఖ్యంగా కష్టకాలంలో జట్టుకు అండగా ఉంటానని చెప్పారు. తన కుటుంబానికి, ఈ ప్రయాణంలో తనతో కలిసి నడిచిన కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, అధికారులు, సిబ్బందికి కూడా మెస్సీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రయాణం అందమైనదే కాకుండా ఎంతో కఠినమైనదని, అయినప్పటికీ తనకు ఎన్నో మరచిపోలేని జ్ఞాపకాలను అందించిందన్నారు. తన సహచరులతో కలిసి అభిమానులు కలలో కూడా ఊహించని ఎన్నో క్షణాలను సృష్టించగలిగామని మెస్సీ అన్నారు. ఆ అనుభవం తనకు అద్భుతంగా అనిపించిందని పేర్కొంటూ అభిమానులపై తన ప్రేమను వ్యక్తం చేశారు. చివరగా "అర్జెంటీనావాడిగా పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు" అంటూ భావోద్వేగ సందేశాన్ని ఇచ్చారు. అనంతరం "లెట్స్ గో, అర్జెంటీనా!" అంటూ తన ప్రకటనను ముగించారు.

# ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన

ఇంగ్లండ్ పర్యటనలో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. మూడు టెస్ట్‌ల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లోనూ ఘోర పరాజయాలను మూటగట్టుకుంది. ఇంగ్లండ్‌కు కనీస పోటీ ఇవ్వలేకపోయింది. తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో చిత్తయిన పాకిస్థాన్.. తాజాగా లార్డ్స్ టెస్ట్‌లో 194 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దాంతో మూడు టెస్ట్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 0-2తో కోల్పోయింది. ఈ పరాజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. పాకిస్థాన్‌తో పాటు ఇంగ్లండ్ కూడా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరలేని పరిస్థితి నెలకొంది. ఈ పరాజయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్‌తో పాటు ఇమామ్ ఉల్ హక్‌ను జట్టు నుంచి తప్పించి పాకిస్థాన్‌కు పంపించాలని నిర్ణయించిందని జియో న్యూస్ పేర్కొంది. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు హైలెవెల్ మీటింగ్ నిర్వహించిందని కూడా తెలిపింది. ఈ సమావేశంలో పీసీబీ ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ, సీఓఓ సుమైర్ అహ్మద్, పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నజీర్, సీనియర్ సెలెక్టర్ అకీబ్ జావెద్, పరిమిత ఓవర్ల హెడ్ కోచ్ మైక్ హెస్సెన్ హాజరయ్యారని పేర్కొంది. ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ కంటే పాకిస్థాన్ ఘోర పరాజయాలే తీవ్ర అసంతృప్తికి గురి చేశాయని పీసీబీ




ఛైర్మెన్ అన్నట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. 'రెండో టెస్టు సందర్భంగా స్కై స్పోర్ట్స్‌లో ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ ప్రసారం కావడం కూడా అధికార వర్గాలను కలవరపెట్టింది. కానీ అన్నింటికన్నా ఎక్కువగా.. మీడియాలో పాకిస్తాన్ జట్టును చిత్రీకరించిన తీరు, వారి ప్రదర్శనే ఆందోళన కలిగించాయి. ఇమామ్ తీవ్ర చిక్కుల్లో ఉన్నాడు. అతని స్థానంలో అబ్దుల్లా ఫజల్ జట్టులో చేరుతాడు.'అని ఓ పీసీబీ అధికారి తెలిపాడు. ఈ వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను తప్పించాలనే యోచనలో పీసబీ ఉన్నట్లు తెలుస్తోంది. సర్ఫరాజ్ అహ్మద్ స్థానంలో పరిమిత ఓవర్ల కోచ్ మైక్ హెస్సేన్‌కే టెస్ట్ టీమ్ బాధ్యతలు కూడా అప్పగించనున్నారని ప్రచారం జరుగుతోంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే మూడో టెస్ట్‌కు ముందే ఈ నిర్ణయం వెలువడనుందని జియో న్యూస్ పేర్కొంది.

# ఆసియా కప్: థాయిలాండ్‌పై భారత్ ఘన విజయం



**హైదరాబాద్ :** మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత జట్టు ఘన విజయం సాధించి టోర్నీని ఘనంగా ప్రారంభించింది. థాయ్‌లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 94 పరుగుల భారీ తేడాతో విజయం నమోదు చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ పోరులో ఓపెనర్ షఫాలీ వర్మ మెరుపు అర్ధశతకంతో సత్తా చాటగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు తిరుగులేని విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ కేవలం 36 బంతుల్లోనే 8 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ప్రతీక రావల్ 18 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 22 పరుగులు చేసి రాణించింది. థాయ్‌లాండ్ బౌలర్లలో లావోమి 3 వికెట్లు పడగొట్టగా, సునిద 2 వికెట్లు తీసింది. అనంతరం 160 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన థాయ్‌లాండ్, భారత బౌలర్ల ధాటికి తలవంచింది. ఆ జట్టు 16.1 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలింది. థాయ్‌లాండ్ బ్యాటర్లలో కొంచరోయెంకాయ్ (41) మాత్రమే ఒంటరి పోరాటం చేయగా, మిగతా వారెవరూ కనీస పోరాట పటిమ కనబరచలేకపోయారు.

# కిరణ్ అబ్బవరం మూవీ హతః

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.




టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి





వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

## ఇరుముడి కట్టు వీడగియో సాంగ్ విడుదల చేసిన మేకర్స్

మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్స్‌నే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలి స్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై-వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా మాలధారుల డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ బీట్స్ పాటకు మరింత జోష్‌ను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. 'ఇరుముడి'లో ఈ పాటతో పాటు 'విల్లాలి వీరుడు', 'మ్లలెపూల పల్లకి' వంటి భక్తి గీతాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.






# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.

---------




# రోమాంచకం ట్రైలర్ కు అదిరిపోయే రెస్పాన్స్

'యానిమల్', 'అర్జున్ రెడ్డి' వంటి ఇంటెన్స్, వయొలెంట్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో, ఆయన సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్ నుంచి ఓ యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ వస్తుండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో యువ నటుడు సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్నాడు. ఈ నేపథ్యంలో, 'రోమాంచకం' మూవీ ట్రైలర్ ఇటీవలే విడుదలైంది. ఊహించినట్టుగానే, ఈ ట్రైలర్‌కు ప్రేక్షకులు, నెటిజన్ల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. సందీప్ వంగా బ్రాండ్‌కు పూర్తి భిన్నంగా, ఆహ్లాదకరమైన వినోదంతో ట్రైలర్ ఉండటంతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది.
'మేమ్ ఫేమస్' చిత్రంతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ సరసన అనంతిక సనిల్‌కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. వేణుగోపాల్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ట్రైలర్ చూస్తుంటే ఇదొక కలర్‌ఫుల్, ఎనర్జిటిక్ రొమాంటిక్ కామెడీ అని స్పష్టమవుతోంది. డేటింగ్ యాప్ స్టార్టప్ నడిపే హీరో, తన వ్యాపారం కోసం చేసే పరిశోధనలో భాగంగా చెన్నైకి చెందిన హీరోయిన్‌తో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత అతని స్నేహితుల గ్యాంగ్‌తో కలిసి చేసే పనులు కొన్ని అనూహ్య సంఘటనలకు దారితీస్తాయి. ఈ క్రమంలో వచ్చే కామెడీ, సంఘర్షణలు ఆసక్తికరంగా ఉన్నాయి.
"రాస్తే రామాయణం... తీస్తే రోమాంచకం" అంటూ హీరో చెప్పే డైలాగ్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉండటంతో పాటు, నేపథ్య సంగీతం కూడా చాలా క్యాచీగా ఆకట్టుకుంటోంది. హింసకు తావు లేకుండా, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా అలరించేలా ఒక క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచడంలో పూర్తిగా సక్సెస్ అయింది. ఈ చిత్రం 2026 సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం

వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.

